క్లుప్తంగా

వాహనానికి ఇన్సూరెన్సు తప్పనిసరి



జరిమానా విధిస్తున్న జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్

కొండపి: వాహనదారుడు తప్పనిసరిగా ఇన్సూరెన్సు కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రకాష్ అన్నారు. కొండపిలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారుడు వాహన పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. శనివారం నిర్వహించిన తనిఖీల్లో నాలుగు వాహనాలకు జరిమానా విధించారు. ఓవర్ లోడుతో వెళుతున్న వాహనానికి రూ.43 వేల జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయాలైన శ్రీహరిబాబు

టంగుటూరు: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి స్థానిక టోల్‌ప్లాజా సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ..మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీహరిబాబు పనిపై టంగుటూరు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా టోల్‌ప్లాజా దాటిన తరువాత ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

కారు బోల్తాపడి ముగ్గురికి గాయాలు

హనుమంతునిపాడు: మండల పరిధిలో కంభం కనిగిరి రహదారిలో శనివారం సాయంత్రం కారు అదుపు తప్పి బోల్తాపడి ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..కూటాగుండ్ల పంచాయతీ పరిధిలోని చిన్న మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిల మనోజ్, దుగ్గిలి రవి, దుగ్గిలి వేణులు కారులో కనిగిరి నుంచి స్వగ్రామం చిన్న మల్లవరం వస్తున్నారు. ఈ తరుణంలో హాజీపురం ఎత్తు రోడ్డు కంభం కనిగిరి రహదారిలో శ్రీరంగాపురానికి సమీపాన రోడ్డు పక్కన ఉబ్బ మట్టి కుప్పను తప్పించబోయి కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో దుగ్గిలి మనోజ్ కాలు విరిగింది. కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కనిగిరి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఏడాదిగా ఎదురుచూపులే..!



పొన్నలూరులో రోడ్డుపక్కనే చెప్పులు కుట్టుకుంటున్న చర్మకారుడు



పొన్నలూరులో కులవృత్తిలో భాగంగా బట్టలు ఇస్త్రీ చేస్తున్న దృశ్యం

- రుణాల ఊసే ఉత్తని కూటమి ప్రభుత్వం
- వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నా ఒక్కరికీ మంజూరు కాని రుణం
- ఏడాదిగా అందని కార్పొరేషన్ రుణాలు
- కులవృత్తుదారులను ఆదుకోని ఆదరణ పథకం
- వ్యవసాయ కూలీలుగా మారుతున్న చేతివృత్తుదారులు

పొన్నలూరు:

కూటమి ప్రభుత్వంలో ఒక్కరికీ మేలు జరగడం లేదు. ఆర్భాటంగా ఏదైనా పథకాన్ని ప్రవేశపెట్టడం, తర్వాత దాన్ని అటకెక్కించడం పరిపాటిగా మారింది. స్వయం ఉపాధి అవకాశాలతో కులవృత్తులను మెరుగుపరుచుకోవడానికి రుణాలు మంజూరు చేస్తామని ప్రభుత్వంగా ప్రకటించింది. అయితే ఏడాదిగా వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అన్ని కార్పొరేషన్ల పరిధిలోని అర్హులందరికి రాయితీ రుణాలు అదజేస్తామని ప్రకటన చేయడంతో అర్హత కలిగిన సుమారుగా 1500 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలిస్తారని భావించిన లబ్ధిదారులకు 14 నెలలుగా నిరాశే మిగిలింది. కారణం రాయితీ రుణాల ఎంపిక ప్రణాళికబద్ధంగా లేదంటూ కొందరు కోర్టును ఆశ్రయించడంతో నిలిచిపోయాయి. దీంతో కూటమి ప్రభుత్వం తీరుతో ఏడాదిగా రాయితీ రుణాల ఊసేలేదు.

నిరాదరణకు గురవుతున్న కులవృత్తులు...

చేతివృత్తిదారులైన చర్మకారులు, నాయీ బ్రాహ్మణ, వడ్రంగి, మేదరి, రజక, కంసాలి, కుమ్మరి, చేనేత వంటి కులవృత్తిదారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడంతో నిరాదరణకు గురవుతున్నారు. దీంతో పాటు చేతివృత్తిదారులు తయారు చేసే వస్తువులు నేడు రెడీమేడ్‌గా మార్కెట్‌లో లభిస్తుండటంతో ఆదరణ కరువై కులవృత్తులు కునారిల్లిపోతున్నాయి. వ్యవసాయ సీజన్ వచ్చిందటంటే గ్రామాల్లోని వడ్రంగులకు భలే గిరాకీ ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వమే అధునిక పద్ధతులంటూ కొత్త పనిముట్లు పరిచయం చేసి రాయితీపై అందిస్తోంది. దీంతో చెక్కతో తయారు చేసే వడ్రంగులకు పని కరువైపోయింది. మిగిలిన కులవృత్తిదారులకు కూడా ప్రభుత్వ ఆదరణ, ప్రోత్సాహం లేకపోవడంతో వారి తమ పనులకు క్రమేణా దూరమవుతున్నారు.

ఆదుకోని ఆదరణ పథకం...

స్వయం ఉపాధి కోసం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్పొరేషన్ రుణాలు, ఆదరణ పథకం ద్వారా కులవృత్తిదారులకు పనిముట్లు అంటూ ఆర్భాటం చేసినా ఏడాదికి పైగా అర్హులకు అవి అందలేదు. ఆదరణ పథం కింద పనిముట్లు పొందడానికి మొదటి విడతలో వందల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే పదుల సంఖ్యలో అరకొరగా అందజేసి చేతులు దులుపుకున్నారు. దీంతో పూర్తిస్థాయిలో అర్హులందరికీ దక్కడంలేదు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఆదరణ పథకం ద్వారా మొక్కుబడిగా అందిస్తున్నా లబ్ధిదారుల ఎంపిక విషయంలో కూడా తెలుగు తమ్ముళ్లు తమ పార్టీ సానుభూతిపరుల్లో కొంత మందికి అర్హత లేకపోయినా వారిని ఎంపిక చేస్తున్నారు. పథకం ఏదైనా మాకే సొంతమంటూ అధికారపార్టీ నాయకులు తమ సానుభూతి పరులకు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు దక్కేలా చేస్తున్నారు. కొందరు టీడీపీ నాయకులు బినామీల పేర్లతో పథకాలకు దరఖాస్తు చేయించి వారికి వచ్చే సొమ్మును కాజేస్తున్నారు.

కూలీలుగా మారుతున్న వైనం..

కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటుతున్నా ఒక ప్రణాళిక ప్రకారం చేతివృత్తిదారులను ఆదుకోకపోవడంతో కులవృత్తులను నమ్ముకొని బతుకుతున్న వారు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. మరికొందరు కుటుంబ పోషణ జరగకా పట్టణ ప్రాంతాలకు వలసలు పోయి బేల్దారీ పనులు చేసుకోని బతుకుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పారదర్శకంగా వ్యవహరించి నిజమైన లబ్ధిదారులకు రాయితీ రుణాలు, చేతివృత్తదారులకు పనిముట్లు అందజేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి:



కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాలాంటి వారిని ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలి. మా జీవన పరిస్థితులు మెరుగుపడేలా రాయితీ రుణాలు అందజేస్తే బాగుంటుంది. రోజంతా చెప్పులు కుడితే రూ.200 కూడా రావడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వ అధికారులు స్పందించి లోను మంజూరు చేయాలి.

కొత్త బాబురావు, చేతివృత్తిదారుడు, పొన్నలూరు

కూలి పనులకు పోతున్నాను:



ఐదేళ్లగా ఇస్త్రీ చేస్తూ వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. రోజంతా ఇస్త్రీ చేసినా రూ.500 కూడా రావడం లేదు. దీంతో అప్పుడప్పుడూ కూలీ పనులకు పోతున్నాను. గత ప్రభుత్వంలో నాకు రెండేళ్ల వరుసగా ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. దీంతో కొంత ఆర్థిక వెసులుబాటు కలిగింది. ప్రస్తుత ప్రభుత్వం మాలాంటి వారికి రాయితీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలి.

గుడ్లూరు యానాది, బట్టల ఇస్త్రీ, పొన్నలూరు

గ్రామ కమిటీలు ఎంతో కీలకం



గ్రామ కమిటీలతో జెడ్పీటీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలే కీలకమని జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ హయంలోనే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు దక్కాయన్నారు. రానున్న రోజులు వైఎస్సార్ సీపీవేనన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను గుడిపాటిపల్లి, పీఎన్‌వరం, జాళ్లపాలెం, పూలిగుంట్ల, రాళ్లపల్లి తదితర గ్రామాల్లో వేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకటరత్నం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పొల్లా సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ కే వెంకట రామయ్య, కాకర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తాతపుడి సురేష్ బాబు, టి.నానీ, జి.రవీంద్రారెడ్డి, వెన్నా తిరుపతిరెడ్డి, నల్లబోతుల చెన్న కృష్ణయ్య, పాప బత్తిన నాగేశ్వరావు, రమేష్, షారక్షన్, తిరుపాలు, ఈశ్వర్, ముసలయ్య, సైకం వెంకటేశ్వరరెడ్డి, దండు జైరాం రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

టంగుటూరు: మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ ఆనందరావు అన్నారు. తూర్పు నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి అధ్యక్షతన శనివారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా క్లస్టర్ నోడల్ అధికారి, మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు హాజరయ్యారు. క్లస్టర్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వల్లూరు కారుమంచి, క్లస్టర్ పరిధిలోని 10 మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, ఆన్‌లైన్‌లో విద్యార్థుల హాజరు, వారి మార్కులు నమోదు చేయాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్నం భోజనం సక్రమంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు నూరు శాతం హాజరయ్యేటట్లు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎంలు రమణారెడ్డి శ్రీనివాసరావు, సీఆర్పీ డి.శ్రీనివాసులు, సిబ్బంది పి.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పతనమవుతున్న కనిష్ట ధరలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రంలో రోజు రోజుకు కనిష్ట ధరలు పతనమవుతున్నాయి. ఓ పక్క కనిష్ట ధరల పతనం, తిరస్కరణ బేళ్లు, నో బిడ్లు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల వ్యవధిలో లో గ్రేడ్‌కు రూ.15 తగ్గించడంతో ఏం చేయాలో అర్థం కాక రైతులు తల్లడిల్లుతున్నారు. నిన్న మొన్నటి వరకు రూ.140 పలికిన కనిష్ట ధరలు శనివారం రూ.124కి పడిపోయింది. వేలం ముగిసే సమయంలో లోగ్రేడ్ ధరలు పతనం కావడం ఏంటని రైతులు మండిపడుతున్నారు. వేలం కేంద్రానికి ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 892 బేళ్లను తీసుకురాగా 769 బేళ్లను కొనుగోలు చేసి 123 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.300, కనిష్ట ధర రూ.125, సరాసరి ధర రూ.229.07గా నమోదైంది. వేలంలో 40 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 149 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. క్లస్టర్ పరిధిలోని జువ్విగుంట, అయ్యవారిపాలెం, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 688 బేళ్లను వేలానికి తీసుకురాగా 539 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.301, కనిష్ట ధర రూ.134, సరాసరి ధర రూ.216.16గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి. శనివారం నుంచి 11వ రౌండ్ వేలం ప్రారంభమైంది.

వెళ్లిరావయ్యా..వినాయకా..!



పామూరులో వినాయక పూజల్లో పాల్గొన్న దద్దాల, నేతలు



గణేష్ నిమజ్జనోత్సవంలో దద్దాల నారాయణ యాదవ్



పాకలలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకుని వెళ్తున్న దృశ్యం



వినాయక విగ్రహానికి నిమజ్జనం

కనిగిరిరూరల్: వినాయకచవతి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిమజ్జనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని పలు చోట్ల కొలువుతీరిన గణనాథులకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. 11వ వార్డులోని టకారిపాలెంలో కొలువు తీరిన గణేశునికి దద్దాల, పార్టీ నేతలు విశిష్ట పూజలు చేశారు. పాతూరులో వినాయకుని విగ్రహాలకు విశిష్ట పూజలు చేశారు. పట్టణంలో 13,20 వార్డుల్లో, పాతూరులో పలుచోట్ల జరిగిన గణపతి పూజలు, అన్నదానంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు. 18వ వార్డులో జరిగిన వినాయకుని పూజల్లో వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. చల్లగిరిగిల పంచాయతీలోని గులుగులూరివారి పల్లిలో జరిగిన గణేశ్ నిమజ్జనోత్సవంలో దద్దాల నారాయణ యాదవ్ విశిష్ట పూజలు చేశారు. విగ్రహ కమిటీ నాయకులు దద్దాల నారాయణను, పార్టీ నేతలను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్, పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, మార్తాల వెంకటేశ్వర్లు, వి.రమణారెడ్డి, పచ్చవ వెంకట సుబ్బయ్య, జి.వెంకట్రావ్ చౌదరి, గుంటూరి వెంకటేశ్వర్లు, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కాసుల రాజు, జి.ఆదిరెడ్డి పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, చిన్న యోగి, రమేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సూర్య నారాయణరెడ్డి, నరసయ్య, జి.రమణారెడ్డి, శ్రీకాంత్, గురవయ్య, డి.కోటిరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

సింగరాయకొండ: పాకల సముద్రతీరంలో గణేశుని నిమజ్జనోత్సవానికి పెద్ద సంఖ్యలో విగ్రహాలు తరలివచ్చాయి. మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పెద్ద సంఖ్యలో తీరానికి తరలి రావటంతో పాకల తీరం జనసంద్రమైంది. ఎస్సై బి.మహేంద్ర తీరంలో భద్రా ఏర్పాట్లు చేయటంతో పాటు స్వయంగా పర్యవేక్షించారు.

పామూరు: వినాయక ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీమాత ఆలయం వద్ద, డీవీపాలెంతో పాటు మండలంలోని కొత్తపల్లె, బోడవాడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్యలు పూజలు చేశారు. వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్ రెడ్డి, కందుల శ్రీనివాసులురెడ్డి, ఇర్రి కృష్ణారెడ్డి, శ్రీరామ శ్రీనివాసులు, ఆవుల భాస్కర్‌రెడ్డి, చల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని పెద్దగొల్లపల్లి, గాయంవారిపల్లిలో వినాయకుని విగ్రహాల నిమజ్జన వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. నిమజ్జన వేడుకలో ఎంపీపీ గాయం సావిత్రి పాల్గొన్నారు. గొల్లపల్లిలో గణనాథుని లడ్డుపాట వేలంపాటలో వేమలపాటి అనీల్‌కుమార్‌రెడ్డి రూ.2.32 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

మర్రిపూడి: మండలంలోని అంకేపల్లి, మర్రిపూడి, వల్లాయపాలెం, గంజిపాలెం గ్రామాల్లో మూడు రోజుల పాటు పూజలందుకున్న వినాయకున్ని శనివారం నిమజ్జనానికి తరలించారు. యువత నృత్యాలు చేస్తూ నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. మర్రిపూడిలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో రూ.29 వేలకు దక్కించుకున్నారు.



పెద్దగొల్లపల్లిలో పూజలు చేస్తున్న ఎంపీపీ గాయం సావిత్రి



మర్రిపూడిలో వినాయకుడి ఊరేగింపు

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత

కనిగిరిరూరల్: బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని బొగ్గులగొంది కాలనీ, ఎస్టీ కాలనీల్లో బాల్య వివాహాల అనర్థాలపై మండల న్యాయ సేవాధికార సంస్థ, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన, సదస్సు నిర్వహించారు. చైర్మన్, న్యాయవాది గఫార్ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, అనర్థాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి, గంధం శామ్యూల్ గెర్షోమ్, మంద్రు రమేష్, నవకుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీఎంకు సీఐటీయూ నేతల వినతి

కనిగిరిరూరల్: ఆర్టీసీ డిపోలో అక్రమంగా తొలగించిన 8 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం డీఎం మొహమ్మద్ సయాన ఖాన్‌గంకు విన్నవించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు మాట్లాడుతూ సూపర్‌వైజర్ అరాచకాలపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అడివయ్య, ప్రసాద్, ఇమ్మానియేలు, డేవిడ్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి.గోపీనాథ్ అధ్యక్షతన మండలంలోని వీఓఏలకు, వలంటరీ టీచర్లకు ఉల్లాస్ – అక్షరాంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఉల్లాస్ – అక్షరాంధ్ర కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరికీ సామాజిక విషయాలైన ఆరోగ్యం, పరిశుభ్రత, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రెండో విడత ఎంపిక చేసినటువంటి గ్రామాలైన అనకర్లపూడి, నెన్నూరుపాడు, పెద్ద కండ్లగుంట, పెట్లూరు, కె.ఉప్పలపాడు గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఎంఈఓ సురేఖ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రైమరీ స్కూళ్లలో నిర్వహించుకోవాలని సూచించారు. అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ సారెడ్డి మాట్లాడుతూ వయోజనులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఏపీఎం గోపీనాథ్ సంస్థాగత నిర్మాణం, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాలు, జీవనోపాధులు మొదలగు విభాగాలపై సమీక్షించి లక్ష్యాలు నిర్దేశించారు. సూపర్‌వైజర్ విక్టోరియా రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడంలో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంజీ మాధవరావు, సీసీలు డి.మల్లికార్జునరావు, వి.కృష్ణారెడ్డి, సీహెచ్ గోవిందమ్మ, కె.రామాంజనేయులు, కేవీ రమణమ్మ, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించుకోవాలి



విగ్రహ ఏర్పాటుకమిటీ సభ్యులకు సూచనలిస్తున్న సీఐ భీమానాయక్

పామూరు: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం మండలంలో గణపతి మండపాల ఏర్పాటు కమిటీ, పీస్ కమిటీ సభ్యులతో ఎస్సై టి.కిషోర్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం మధ్యాహ్నం ఒంటి గంట కల్లా ప్రారంభించి రాత్రి 9 గంటల లోపు పూర్తిచేయాలన్నారు. మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొనవద్దని సూచించారు. నిమజ్జనంలో పిల్లలను తీసుకువెళ్లవద్దన్నారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా, అధిక సౌండ్‌తో డీజేలు పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యలపై తక్షణం స్పందించండి



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య సమస్యలపై తక్షణం స్పందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 5,7,8వ వార్డుల్లో శనివారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు వార్డుల్లో అధ్వాన్న పారిశుధ్యం, మురికినీటి కాలువల పరిశుభ్రత తదితర సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చే పారిశుధ్య సమస్యపై, ఫిర్యాదులపై సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తక్షణ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన, చైతన్యం కల్గించాలన్నారు. వాతవరణ మార్పులు, నీటి నిల్వలు, పారిశుధ్యం వల్ల రోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.